క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొంటాం



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: అకాల వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల సాయం అందించడంతో పాటు, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని గాలిపల్లి, తాళ్లపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించడంతో పాటు, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని, రెండు రోజుల్లోగా పంట నష్టం సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సర్పంచులు వాణి, పద్మ నాయకులు పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్‌రావు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం నార్మల్ డెలివరీలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు మాట్లాడుతూ మొదటి కాన్పు మహిళలకు నార్మల్ డెలివరీ వల్ల జరిగే లాభాలు, ప్రయోజనాలు తెలిపారు. ప్రతి ఒక్కరు ఏరియా ఆసుపత్రిలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చైతన్యసుధా, దీప్తీ, సంతోష్‌కుమార్ చారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటకు కొత్తగా బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో కొత్తగా ఎల్లారెడ్డిపేట నుంచి సిద్దిపేటకు సిరిసిల్ల డిపోకు చెందిన బస్సును జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజు ఎల్లారెడ్డిపేట మీదుగా బండలింగంపల్లి, మస్తాబాద్ మీదుగా సిద్దిపేటకు వెళ్తుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ప్రతిరోజు ప్రయాణం చేస్తే 20 కిలోమీటర్ల దూరం తగ్గడమే కాకుండా, సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఈ రూటులో అధికారులు పెట్టే టార్గెట్‌ను సాధించే విధంగా ప్రజలు ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠధామాలేవీ?

- మూలవాగు, చెరువు కుంటల్లోనే దహన సంస్కారాలు
- విలీన గ్రామాలపై శీతకన్ను
- ఇబ్బందిపడుతున్న వార్డు ప్రజలు

వేములవాడఅర్బన్: జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లో వైకుంఠధామాల పేరుతో శ్మశానవాటికలు నిర్మించి ప్రభుత్వం వేములవాడ మున్సిపల్ విలీన గ్రామాలను మాత్రం మరిచిందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు శ్మశానవాటిక లేదు, కనీసం మున్సిపల్‌లో చేరితే అయినా అభివృద్ధి జరుగుతుంది, సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురుచూసిన వార్డు ప్రజలకు నిరాశే మిగిలింది.

వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్, నాంపల్లి విలీన గ్రామాల్లో ప్రభుత్వం వైకుంఠధామాలు ఏర్పాటు చేయకపోవడంతో వార్డు ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. వార్డుల్లో ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియలను భూములు ఉన్న వారు తమ సొంత భూముల్లో జరుపుకుంటున్నారు. లేని వారికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. దహన సంస్కారాలు చేయడం పెద్ద సమస్యగా మారిందని, గ్రామాల పక్కన ఉన్న చెరువు, కుంటల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో దహనసంస్కారాలు చేస్తున్నారు. అక్కడికి దారిలేక, నీటి వసతిలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.



తిప్పాపూర్ మూలవాగులో అంతిమ సంస్కారాలు నిర్వహించే స్థలం

ఇప్పటికైనా వార్డు కౌన్సిలర్లు, అధికారులు వైకుంఠధామాలకు స్థలాలను పరిశీలించి, ప్రతి వార్డు, వార్డులోని పల్లెల్లో కూడా వీటిని నిర్మించాలని వేడుకుంటున్నారు.

నాంపల్లిలో ఏడు పల్లెలు

వేములవాడ మున్సిపల్‌లోని నాంపల్లిలో ఐదో వార్డు, ఆరో వార్డు, రెండు వార్డులకు 7 గ్రామాలు ఉన్నాయి. నాంపల్లితో పాటు గురువయ్యనగర్, గొల్లపల్లె, ఇస్లాంనగర్, బోజ్జపల్లె, శాంతినగర్, శాలరామన్నపల్లె, శివపార్వతులకాలనీ ఉన్నాయి. ఈ పల్లెల్లో ఎక్కడ కూడా వైకుంఠధామాలు లేవు. పొలాల్లో దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. వర్షాకాలం అయితే చెరువుల, కుంటలు నిండి అక్కడికి వెళ్లాలంటే దారి సరిగా లేక నానా అవస్థలు పడుతున్నారు.

తిప్పాపూర్‌లో..

తిప్పాపూర్‌లో ఎవరైనా మరణిస్తే వేములవాడ మూలవాగులోకి తీసుకువెళ్లాల్సిందే. ఆ మూలవాగులో మూడు దిక్కులకు తీసుకువెళ్తారు. కొందరు బ్రిడ్జి పక్కన ఉండే వాగులోకి, మరికొందరు మూలవాగు బతుకమ్మ తెప్ప వైపు, మరికొందరు ప్రభుత్వ పాఠశాల వెనుక వైపు ఉన్న మూలవాగులోకి తీసుకువెళ్తారు. ఎక్కడికి తీసుకువెళ్లిన దారి సరిగా లేదు. నీటి వసతి అసలే లేదు. వర్షాకాలం వాగు పారుతుంటది, ఎండకాలం కాళ్లు సుర్రుమంటాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వైకుంఠధామం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఈ వార్డు ప్రజలు కోరుతున్నారు.

మూలవాగు దిక్కు



తిప్పాపూర్‌లో ఎవరు మరణించినా మూలవాగులో దహన సంస్కారాలు చేస్తున్నారు. అక్కడ నీటి వసతి, దారి లేదు. వర్షాకాలం, ఎండకాలం చాలా ఇబ్బంది పడుతున్నారు. వైకుంఠధామం ఏర్పాటు చేయాలి.
– శ్రీనివాస్ తిప్పాపూర్

ఇబ్బందిగా మారింది



నాంపల్లితో పాటు ఏడు పల్లెలకు కూడా వైకుంఠధామాలు లేక ఎవరు మరణించిన వారి అంత్యక్రియలు చెరువు, కుంటల పక్కన చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవాలి.
– చిలివేరి శ్రీనివాస్, నాంపల్లి

స్థలాలను పరిశీలిస్తాం



వేములవాడ మున్సిపల్ విలీన గ్రామాలు తిప్పాపూర్, నాంపల్లిలో వైకుంఠధామాల కోసం స్థలాలను పరిశీలించి, స్థలం ఉంటే మున్సిపల్ పాలకవర్గం తీర్మానించిన తదుపరి నిర్మిస్తాం.
– మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, వేములవాడ



ప్రమాదకరంగా పారాపెట్

మున్సిపల్ నిర్వహణలో ఉన్న పాత బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ పైఅంతస్తులోని పారాపెట్ వాల్ వర్షపు నీటికి తడిసి శిథిలమైంది. ఇనుప చువ్వలు పైకి తేలి కనిపిస్తున్నాయి. విరిగి పడితే కింద ఉన్న జనంపై పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. మరమ్మతు చేయాలని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని షాప్ యజమానులు ఆరోపిస్తున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, సిరిసిల్ల

చిత్రకథ



వంగిన విద్యుత్ స్తంభం

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. గ్రామం నుంచి మల్కపేటకు వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు వంగిపోతున్నాయి. ఈ స్తంభాలను సరిచేయాలని స్థానిక రైతులు అధికారులను ఎన్నిసార్లు కోరినా స్పందించడంలేదన్నారు. ఇప్పటికైనా సెస్ అధికారులు వంగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యం కొనాలంటూ రైతుల ధర్నా

ఇల్లంతకుంట: అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ మండలంలోని గాలిపల్లి వద్ద రోడ్డుపై రైతులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, ఇప్పటి వరకు సక్రమంగా తూకం వేయడం లేదని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ స్పందించి వెంటనే ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరవై మంది రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

కంటి వెలుగు ప్రారంభం



కళ్లద్దాలు అందజేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్, ఎంపీపీ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శరత్‌రావు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సర్పంచ్ బిల్లవేని పర్శరాం, వైద్యాధికారి రమేశ్, ఉపసర్పంచ్ కావ్య స్వామి, ఏఎంసీ డైరెక్టర్ మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.
చందుర్తి: మండలం కట్టలింగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఏనుగుల జమున సోమవారం ప్రారంభించారు.
ముస్తాబాద్: మండలంలోని సేవాలాల్‌తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ జనగామ శరత్‌రావు సోమవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్, ఉపసర్పంచ్ మహేశ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కలకొండ కిషన్‌రావు, మాజీ సర్పంచ్ కట్ట బాపురావు పాల్గొన్నారు.

మొక్కల నరికివేతపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మల్లారం గ్రామంలో 'నాటిన చేతులతో నరికారు' అనే వార్త సాక్షి కథనానికి స్పందించిన ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో మల్లయ్య సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు ఉండడంతోనే నరికివేసినట్లు సర్పంచ్ వారి దృష్టికి తీసుకురాగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎలా నరికివేస్తారని ప్రశ్నించడంతో మళ్లీ వాటికి బదులు మరికొన్ని మొక్కలు నాటుతామని చెప్పినట్లు తెలిసింది.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఆదివారం గుండెపోటుతో మరణించిన గ్రామపంచాయతీ కారోబార్ మల్లమారి ప్రభాకర్(34) అంత్యక్రియలు సోమవారం చందాలతో గ్రామస్తులు నిర్వహించారు. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు దాతలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఎంపీపీ పడిగెల మానస రూ.5 వేలు, గ్రామపంచాయతీ పాలకవర్గం రూ.20 వేలు, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్రావు రూ.10 వేలు, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్ రూ.10 వేలు చొప్పున అందించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ధాన్యం కొనుగోళ్లను కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉల్లెందుల అంజయ్య, వడిజె మల్లయ్య, రుద్రవరం పీఏసీఎస్ సీఈవో సుమన్, రైతులు మల్లయ్య, తిరుపతి, మల్లేశం, రాజు పాల్గొన్నారు.
చందుర్తి: రుద్రంగి మండలం మానాల బడి తండాలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో అధ్యక్షుడు ఏలేటి చిన్నారెడ్డి, వైస్‌ఎంపీపీ భూమయ్య సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అల్లూరి మానస, గుగులోతు మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డెగావత్ తిరుపతి, ఉపాధ్యక్షుడు అంబర్‌సింగ్, ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్ సుందర్, వీడీసీ అధ్యక్షుడు గోపిడి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న కౌన్సిలర్

బలగం చిత్ర నటుడికి సన్మానం



సన్మానిస్తున్న వికాస్, కళాకారులు

కోనరావుపేట: మండలంలోని నాగారంలో బలగం చిత్ర నటుడు కీసరి నర్సింగంను ప్రతిమ ఫౌండేషన్ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు–దీప సన్మానించారు. అనంతరం వేములవాడ మండలం లింగంపెల్లి గ్రామ కళాకారులకు సంగీతవాయిద్యాలు అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు రూ.20 వేల నగదు, క్రీడాకారులందరికీ టీషర్టులు అందజేశారు. అలాగే నాగారంకు చెందిన పేదింటి ఆడపడుచు బత్తుల మరియ కూతురు లక్ష్మి పెళ్లికి రూ.11,116 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, వార్డు సభ్యులు దుంపెట రమ, ఆస్పత్రి బాధ్యులు కౌశిక్ పాల్గొన్నారు.

భజన మండలికి సామగ్రి

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉన్న భజన మండలి సభ్యులకు సామాగ్రిని ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు డా.చెన్నమనేని వికాస్‌రావు అందజేసినట్లు సర్పంచ్ సామ కవిత తెలిపారు. ఈ సందర్భంగా భక్తమండలి తరుపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ స్థలం ఆక్రమణపై డీపీవోకు ఫిర్యాదు

కోనరావుపేట: మండలం వట్టిమల్లలో గ్రామపంచాయతీకి చెందిన స్థలం ఆక్రమణపై గ్రామస్తులు డీపీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ సమీపంలోని పంచాయతీకి చెందిన భూమిలో గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి 80 గజాల భూమిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీకి లేఖ రాశారు. పంచాయతీ ఆధ్వర్యంలో సదరు భూమిలో కుల సంఘాలు, పాలకులు విచారణ జరిపి శంకరయ్య అనే వ్యక్తి 80 గజాలలో ఇల్లు కట్టేందుకు అనుమతి తీసుకుని 160 గజాలలో నిర్మించారని, మిగతా 80 గజాల భూమి పంచాయతీదేనని తేల్చి చెప్పారు. డీపీవో ఆదేశించినా ఆక్రమించిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సర్పంచ్ కొమ్ము స్వప్నను వివరణ కోరగా 80 గజాల్లో అనుమతి తీసుకుని 160 గజాల్లో కట్టింది వాస్తవమే కానీ ఆ స్థలం గ్రామపంచాయతీకి చెందిన స్థలం అనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

గంభీరావుపేట: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు సోమవారం భూమిపూజ చేశారు. గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులు, యాదవ సంఘం భవన నిర్మాణం, బోరుబావి నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీపీ వంగ కరుణ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, వైస్ ఎంపీపీ దోసల లత, ఎంపీటీసీ భాగ్య, యాదవ సంఘం, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై వివక్ష

సిరిసిల్ల టౌన్ : మున్సిపల్ కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. సోమవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్, కొవిడ్, స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాల్లో కార్మికుల సేవలను ప్రభుత్వాలు గుర్తించకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన నిరుపేద జంగం సుజనవ్వ కుటుంబానికి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వంగల రవీందర్ సోమవారం రూ.10 వేల నగదు, బియ్యం అందించారు.

రైతులను ఆదుకోవాలి

ఇల్లంతకుంట: వడగళ్ల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు అన్నారు. మండలంలోని పాత్తూరు, గాలిపల్లి గ్రామాల్లో ఆదివారం పంట నష్టాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గాలిపల్లి ఇళ్లు దెబ్బతిన్న రెండు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికారప్రతినిధి కొత్త శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు

తంగళ్లపల్లి : పెద్దపెల్లి జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా మండలంలో ఏబీవీపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. సోమవారం ఏబీవీపీ నాయకుడు సామనపెల్లి ప్రశాంత్‌ను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ప్రశాంత్ మాట్లాడుతూ... మంత్రి కేటీఆర్ పర్యటనల పేరుతో ఇంకెన్ని రోజులు అరెస్టులు కొనసాగిస్తారని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల లీకేజీతో నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని, ఇప్పటి వరకు టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్, సభ్యులను సస్పెండ్ చేయలేదన్నారు.

సమాచారం

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నరేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా సకాలంలో హాజరు కావాలన్నారు.

10న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

సిరిసిల్లఅర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే సంక్షేమ గురుకుల పాఠశాలలో 6, 7, 8వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ ప్రవేశ పరీక్ష ఈనెల 10 నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గౌతమ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష సమయం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందే సెంటర్లకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కరీంనగర్ 9, పెద్దపలి 7, జగిత్యాల 9, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 5 సెంటర్లు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నియామకం

గోపా అధ్యక్షుడిగా పరుశరాములు

ముస్తాబాద్: గౌడ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర బాధ్యుడు ఎలమ్మల లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. అధ్యక్షుడిగా కదిరే పరుశరాములుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి బాలకృష్ణగౌడ్, కోశాధికారిగా నామాపూరం అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా భూంపెల్లి రాజుగౌడ్, కోల దేవరాజ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అక్కపల్లి సంతోష్, కంచర్ల రాములు, జాయింట్ సెక్రటరీగా బైరి శ్రీనివాస్, పదిర రాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గసభ్యులుగా బాదవేని అంజాగౌడ్, అక్కపల్లి లక్ష్మీపతిగౌడ్ ఎన్నికయ్యారు.

జీపీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

గంభీరావుపేట: గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ సమక్షంలో ఎన్నికైంది. అధ్యక్షుడిగా మహ్మద్ షాదుల్(కొత్తపల్లి), ప్రధాన కార్యదర్శిగా అక్కల అంజాగౌడ్(దమ్మన్నపేట) ఎన్నికయ్యారు.

బీరప్ప కల్యాణోత్సవం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని 21వ వార్డులో యాదవ కులాల ఆధ్వర్యంలో సోమవారం బీరప్ప స్వామి–కామంతిదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు వేముల రవి, అన్నారం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మడేలేశ్వరస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీ మడేలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం హోమంతో పాటు బలిహరణం, సర్వగంప బలితో కార్యక్రమాలను ముగించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ జయంత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జనహితకు అర్జీలు కరువు

చందుర్తి/కోనరావుపేట/వీర్నపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనహిత కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం ఒక్క అర్జీ కూడా రాలేదు. గతంలో ఇచ్చిన అర్జీలను అధికారులు పరిష్కారించక పోవడంతో అర్జీలు పెట్టుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. 18 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా నామమాత్రంగా అధికారులు హాజరు అవుతున్నారు. ప్రతి వారం నిర్వహిస్తున్న కార్యక్రమానికి అధికారులు మొక్కుబడిగా హాజరవుతూ వస్తున్నారు. కొంతమంది అధికారులు వచ్చి సంతకం పెట్టి పనుల మీద వెళ్లిపోతున్నారు. జనహితకు రాని అధికారులపై చర్యలు తీసుకోవడానికి సంశయిస్తున్నారు.